మహిళలను ప్రోత్సహించాలి

■ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి శ్రీదేవి

జెండా ఊపి ర్యాలీని పారంభిస్తున్న జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి శ్రీదేవి

కామారెడ్డి, మార్చి 7 : మహిళలను పురుషులు ప్రోత్సహించాలని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా పాలన, పోలీసు యంత్రాంగం సహకారంతో జిల్లా కోర్టు సముదాయం నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీని గురువారం ప్రారంభించారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ, సీనియర్ సివిల్ జడ్జి కం సెక్రటరీ నాగారాణి, మహిళలు, ఎన్సీసీ క్యాడెట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ.. స్త్రీ ఆదిశక్తి అని, పురాణ కాలంలోనే స్త్రీకి ఉన్నత స్థానం ఇచ్చి గౌరవించారని అన్నారు. ఒక మహిళా తల్లిగా, చెల్లిగా, భార్యగా ఎంతో సేవ చేస్తుందని, ఆ మానవతా మూర్తికి అవకాశాలు ఇస్తే అంతరిక్షనికైనా వెళ్తారని అన్నారు. మహిళలు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తారని అన్నారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తుండడం ఎంతో గర్వకారణమని అన్నారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ.. మహిళలకు ప్రత్యేకించి ఒక రోజు కేటాయించి పండుగ వాతావరణంలో కార్యక్రమాలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చిన మహిళలను సన్మానించుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, కలెక్టర్ సతీమణి శ్రద్ధ మహాజన్, ట్రైనీ ఎస్పీ కాజల్ సింగ్, డీఎఫ్‌వో నిఖిత, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఎస్సీ అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బావయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం..

ఎల్లారెడ్డి రూరల్/నిజాంసాగర్/పిట్లం/బాన్సువాడ రూరల్/బీబీపేట్, మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఎల్లారెడ్డి న్యాయమూర్తి హారికతోపాటు కోర్టు మహిళా సిబ్బందిని స్థానిక డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్, ఎస్సై బొజ్జ మహేశ్ కలిసి ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కార్యాలయంలో మహిళా, మెప్మా సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు సత్కరించారు. మోడల్ డిగ్రీ కాలేజీలో అధ్యాపకురాళ్లు, సిబ్బందిని ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ సన్మానించారు. నిజాంసాగర్ కస్తూర్బా పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సంలో ఎంఈవో దేవీసింగ్ పాల్గొని ప్రిన్సిపాల్ సరోజనతోపాటు ఉపాధ్యాయురాళ్లను సన్మానించారు. అనంతరం సిబ్బందికి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అమర్ సింగ్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, కార్యద ర్శి సంతోష్‌కుమార్, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు. నిజాంసా గర్ మండలంలోని మాగిలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల తోపాటు పారిశుద్ధ్య కార్మికులు, బీపీఎంలను గ్రామ ప్రత్యేకా ధికారి అమర్‌ప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, కారోబార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కుర్తి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న శ్రీదేవి, రాజేశ్వరిని ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రధానోపా ధ్యాయుడు రవీందర్‌జెట్టి, సిబ్బంది శరణప్ప, కృష్ణమూర్తి, సీఆర్పీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఎంపీపీ దొడ్ల నీరాజావెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీతోపాటు మహిళా ఉద్యోగులకు ఎంపీడీవో బషిరుద్దీన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోర్లం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఎంపీవో సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు తదితరులు పాల్గొన్నారు. రాజంపేటలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బీబీపేట్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎంపీపీ బాలమణితోపాటు మహిళా ఎంపీటీసీలు, మహిళా ఉద్యోగులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఉద్యోగినులు, విద్యార్థులు

నిజాంసాగర్‌లోని కస్తూర్బాలో విధులు నిర్వహిస్తున్న వర్కర్స్‌కు చీరెలు అందజేసిన ఎంఈవో దేవీసింగ్

బాన్సువాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, మహిళా ఉద్యోగులను సన్మానించిన అధికారులు

బోర్లం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన ప్రత్యేక అధికారి, గ్రామస్తులు

రాజంపేట్‌లో బహుమతులు అందజేత..

కుర్తిలో ఉపాధ్యాయురాళ్లను సన్మానిస్తున్న టీచర్లు

న్యాయమూర్తి హారికను సన్మానిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

మోడల్ డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకురాలిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్

మాగి గ్రామ పంచాయతీలో అంగన్‌వాడీ, ఆశ , పంచాయతీ కార్మికులను సన్మానించిన ప్రత్యేకాధికారి అమర్‌ప్రసాద్

ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

మహిళలకు సర్టిఫికెట్ల అందజేత


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్‌కుమార్

బీబీపేట్, మార్చి 7 : మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో నాబార్డ్ సహకారంతో ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని 30 మంది మహిళలకు మగ్గం వర్క్‌పై 15 రోజులు ఉచిత శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్‌కుమార్, ఐకేపీ ఏపీఎం బాలపోచయ్య కలిసి 30 మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు బ్యాంకుల సహాయం తీసుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ గజానంద్, ఐకేపీ ఏపీఎం బాలపోచయ్య, పంచాయతీ కార్యదర్శి ఇంతియాజ్, సీసీ నవీన్, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రాజలింగం, ప్రవీన్, వీవోఏలు దేవలక్ష్మి, అపర్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి పలువురి నాయకుల సస్పెన్షన్

మాట్లాడుతున్న ఎంపీపీ రఘు,బీఆర్ఎస్ నాయకులు

నస్రుల్లాబాద్, మార్చి 7 : బీర్కూర్ మండలంలోని పలువురు నాయకులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ నుంచి గురువారం సస్పెండ్ చేసినట్లు ఎంపీపీ రఘు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మండల జడ్పీటీసీ స్వరూప, మాజీ జడ్పీటీసీ ద్రోణవల్లి సతీశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ ద్రోణవల్లి అశోక్, భైరాపూర్ పీఎస్‌సీఎస్ చైర్మన్ రామకృష్ణ, కిష్టాపూర్ మాజీ సర్పంచ్ బాబురావు, భైరాపూర్ మాజీ సర్పంచ్ గుమ్మ అంజవ్వ, ఎంపీటీసీ ఎర్ర భారతి, అన్నారం మాజీ సర్పంచ్ కృష్ణా రెడ్డి, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ రామకుమారి, నాయకులు కమ్మ సత్యనారాయణ, రాంబాబును బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్ చేసినట్లు ఆయన తెలిపారు.

వివిధ పండుగలను పురస్కరించుకొని ఆర్టీసీ ఆధ్వర్యంలో 15.10.2023 నుంచి 22.01.2024 వరకు 'గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్'ను నిర్వహించగా నిజామాబాద్ రీజియన్ మూడో స్థానంలో నిలిచింది. సకాలంలో బస్సులు నడిపి ప్రతిభ కనబర్చిన మూడు రీజియన్లకు హైదరాబాద్ ఆర్టీసీ కళాభవన్‌లో ఎండీ సజ్జనార్ గురువారం సిబ్బందిని సన్మానించి, అభినందించారు. బాన్సువాడ డిపో మేనేజర్ సరితాదేవి, డ్రైవర్, కండక్టర్లు పండరి, అతిక్, సాజీద్, హైమద్‌కు ఈ అవార్డులు వరించాయి. – ఖలీల్‌వాడి, మార్చి 7

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

సమ్మెలో పాల్గొన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

భిక్కనూరు, మార్చి 7 : భిక్కనూర్‌లోని సౌత్ క్యాంపస్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నది. ఈ సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తూ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కార్యక్రమం లో బీఆర్ఎస్ మండల జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు బాల్‌చంద్ర, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, రాజు, సురేశ్, గోపి పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించినయువకుడికి సన్మానం

పెద్ద కొడప్‌గల్, మార్చి 7: మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన అబ్బన బోయిన విజయ్‌కుమార్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాడు. దీంతో గ్రామస్తులు గురువారం అతడికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మల్లప్ప పటేల్, మాజీ ఎంపీటీసీ మొగులాగౌడ్, బస్వరాజ్, సింగిల్ విండో డైరెక్టర్లు గంగాగౌడ్, పెంటన్న, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలి

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, ఫిబ్రవరి 7 : పార్టీలకు అతీతంగా కామారెడ్డి పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి బల్దియా పాలకవర్గ సభ్యులు, అధికారులు సహకరించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి మున్సిపల్ సాధారణ సమావేశాన్ని చైర్‌పర్సన్ జాహ్నవి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, మున్సిపల్ కమిషనర్ సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో పాలకవర్గ సభ్యులు సహకారం అందించాలని కోరారు. కొత్తగా నిర్మించిన గృహాలను అధికారులు పరిశీలించి కొలతల ఆధారంగా పన్నులు వసూలు చేయాలని చెప్పారు. రోడ్లపై చెత్త వేస్తే వారికి జరిమానా విధించాలని సూచించారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. పట్టణ ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. మున్సిపల్ సమావేశం ఎజెండా అంశాలు తమతో చర్చించకుండా మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, బీఆర్ఎస్ కౌన్సిలర్లు తయారు చేశారని, సమావేశాన్ని వాయిదా వేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు తీర్మాన పత్రాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్‌కు అందించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి, మార్చి 7 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ద్వితీయ సంవత్సర మ్యాథ్స్ బి, జువాలజీ, హిస్టరీ పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 37 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం జనరల్ 5,636 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 5,511 మంది హాజరయ్యారు. 125 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 1,059 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,035 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

రాష్ట్ర స్థాయి విజేతకు అభినందన

ఎల్లారెడ్డి, మార్చి 7: జాతీయ సైన్స్ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి పొందిన ఇఫ్రా అనే విద్యార్థిని ఎంఈవో వెంకటేశం గురువారం అభినందించారు. కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఇఫ్రా కవితల పోటీలో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ జోషి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

మాచారెడ్డి, ఫిబ్రవరి 7 : మాచారెడ్డి సొసైటీ చైర్మన్ పూల్‌చంద్‌పై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగినట్లు డీసీవో శ్రీనివాస్‌రావు ప్రకటించారు. గురువారం ఉదయం 11 గంటలకు డైరెక్టర్లు కార్యాలయానికి హాజరై బలపరీక్షను నిరూపించాల్సి ఉండగా డైరెక్టర్లు ఎవరూ రాకపోవడంతో ఒంటి గంటకు చైర్మన్‌పై అవిశ్వాసం వీగినట్లు ప్రకటించారు. చైర్మన్ పూల్‌చంద్‌పై అవిశ్వాసం వీగడంతో ఆనందం వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మాచారెడ్డి, మార్చి 7 : మండలంలోని అక్కాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీటీసీ బట్ట లత పరిశీలించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులు వాడాలని, వంట చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుశ్రీ, ఉపాధ్యాయులు ఉన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా పరిశీలన

ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నిజాంసాగర్, మార్చి 7: నిజాంసాగర్‌లో మిషన్ భగీరథ నీటి సరఫరా తీరును ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీకాంత్, ఏఈ సుమలత గురువారం పరిశీలించారు. కొన్ని నెలలుగా మిషన్ భగీరథ నీటితో పాటు బోరుబావి నీటిని కూడా ట్యాంకులోకి మళ్లించి సరఫరా చేస్తున్నారని ఫిర్యాదు వచ్చింది. దీంతో అధికారులు పరిశీలించారు. మిషన్ భగీరథ నీటితో బోరుబావి నీటిని కలిపి సరఫరా చేస్తే చర్యలు తప్పవని స్థానిక సిబ్బందికి హెచ్చరించారు. వారివెంట పంచాయతీ కార్యదర్శి గంగారాం, కారోబార్ సాయిలు తదితరులు ఉన్నారు.

నిజాంసాగర్ నీటి విడుదల


ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు

నిజాంసాగర్, మార్చి 7: నిజాంసాగర్ ఆయకట్టు పంటల కోసం ఆరో విడుత నీటి విడుదలను గురువారం ప్రారంభించినట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు. రెండు వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు ఐదు విడుతల్లో 7.60టీఎంసీల నీటిని పంటల కోసం అందించామని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం 10 తేదీన ఆరో విడుత నీటిని విడుదల చేయాల్సి ఉండగా.. ఆయకట్టు పంటలకు నీరు అవసరం ఉండడంతో ముందుగానే విడుదల చేశామని చెప్పారు.

గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం

పిట్లం, మార్చి 7: మండలంలోని గద్దగుండుతండా సమీపంలో అటవీ ప్రాంతంలో జాతీయ రహదారి పక్కన ఓ గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై నీరేశ్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 20 రోజుల క్రితం మహిళ మృతిచెంది ఉంటుందని, 20-30 ఏండ్ల మధ్య వయస్సు ఉండవచ్చని అనుమానం వ్యక్తంచేశారు. మృతురాలి ఒంటిపై నీలిరంగు చీర, కాళ్లకు వెండి పట్టగొలుసులు, చేతికి పసుపు, ఎరుపు రంగు గాజులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు తెలిసిన వారు పిట్లం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

కామారెడ్డి/ ఎల్లారెడ్డి/ నిజాంసాగర్/ ఎల్లారెడ్డి రూరల్/ గాంధారి/ పిట్లం/ బిచ్కుంద, మార్చి 7 : హిందువుల ముఖ్యమైన పండుగల్లో శివరాత్రి ఒకటి. పండుగకు భక్తులు ఉపవాసం ఉండి శివుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. పండుగ సందర్భంగా జిల్లాలోని అన్ని శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు గ్రామ శివారులో ఉన్న త్రిలింగేశ్వరాలయంలో నేటి(శుక్రవారం) నుంచి నాలుగు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం పూజలు, అర్చనలు, అభిషేకాలు, రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భజన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 9న ఎడ్లబండ్ల ప్రదర్శన, 10న జబర్దస్త్ ఫేమ్ కొమురక్క కార్యక్రమం, భజనలు, 11న సోమవారం పూర్ణాహుతి, బిచ్కుంద కీని మహరాజ్ ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ బాధ్యులు కోరారు.

నిజాంసాగర్‌లోని చంద్రమౌళీశ్వర ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వొడ్డేపలి పాపేశ్వర ఆలయం, అచ్చంపేట సంగమేశ్వరాలయం, నర్వ, బుర్గుల్, సింగీతం గ్రామాల్లోని శివాలయాలు శివరాత్రి వేడుకల కోసం ఏర్పాట్లు పూర్తిచేశారు. పిట్లం మండలంలోని రామేశ్వరాలయం, రామ లింగేశ్వరాలయం, రాజరాజేశ్వరాలయాలను శివరాత్రి ఉత్సవాల కోసం ఆలయ, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు.

తాండూర్‌లోని త్రిలింగేశ్వరాలయం

ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామ శివారులో ఉన్న పందిరిగుండు పరమేశుని ఆలయంలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు రుద్రారం గ్రామ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేద పండితుడు నరేశ్ పంతులు అధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి అన్నదానం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని గ్రామ కమిటీ సభ్యులు కోరారు.

ఎల్లారెడ్డిలోని నీలకంఠేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాలు రెండు రోజులు జరుగుతాయని ఆలయ పూజారులు సంగప్ప సోదరులు తెలిపారు. 8వ తేదీన పల్లకీసేవ, శివపార్వతుల కల్యాణం, లింగోద్భవం, 9వ తేదీన అగ్నిగుండాలు, అన్నదానం, ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

బిచ్కుందలోని కాశీ విశ్వనాథాలయంలో బసవలింగప్ప సంస్థాన్ మఠం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కేదరినాథ్ పర్వతాల నమూనాలో 102 అడుగుల శివలింగానికి 108 రకాల ద్రవ్యాలతో రుద్రాభిషేకం చేయనున్నారు. శివరాత్రి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపుల పెద్ద సంఖ్యలో పండ్ల దుకాణాలు వెలశాయి. అరటి, ద్రాక్ష పండ్లు, సేపులు, కర్బూజ, సపోటలతో పాటు రత్నపురి గడ్డలను విక్రయించారు. వీటిని కొనుగోలు చేయడానికి మండల కేంద్రంతోపాటు చుట్ట పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉపవాస దీక్షలో ఉన్న వారు పండ్లు కొనుగోలు చేయడంతో వాటిని ధరను పెంచి విక్రయించారు.

కామారెడ్డిలోని బ్రహ్మకుమారి నిలయంలో ముస్తాబైన ఆలయం

బిచ్కుందలో ఏర్పాటుచేసిన సెట్టింగ్

పిట్లంలోని రాజరాజేశ్వరాలయం

గాంధారిలో వెలిసిన పండ్ల దుకాణాలు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, MOHAMMED YOUSUF MAJ S/o. MOHAMMED YOUNUS, H.No.1-11, Velpur, (D) Nzb. Changed my name as MOHAMMAD YOUSUF MAAZ S/o. MOHAMMAD YOUNUS

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-311802

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.